

సిరులతల్లికి తులసీదళార్చన

విశాఖ: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో సహస్ర తులసీదళార్చన ఘనంగా నిర్వహించారు.



అలరించిన త్యాగరాజ కృతులు

విశాఖ : నగరంలోని జీవీకే కళాశాలలో ప్రముఖ గాయని ముట్నూరి జలజాక్షి కర్ణాటక గాత్ర కచేరి ప్రేక్షకులను అలరించింది.



జిల్లాలో స్పోర్ట్స్ విలేజ్

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలు అనకాపల్లిలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో 400 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. 8లో

న్యూస్‌రీల్

'మెట్రో కెమ్'లో ప్రమాదం

- కెమికల్ రియాక్షన్ వల్ల చెలరేగిన మంటలు
- మంటలు అదుపు చేసిన ఫైర్ సిబ్బంది



మెట్రో కెమ్ పరిశ్రమ ముందు హడావుడి

పరవాడ: పరవాడ ఫార్మాసిటీలోని మెట్రో కెమ్ ఏపీఐ పరిశ్రమలో ప్రమాదం జరిగింది. శనివారం రాత్రి 9.10 గంటల సమయంలో ఏ-బ్లాక్‌లో కెమికల్ రియాక్షన్ వల్ల మంటలు చెలరేగాయి. దీంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న కార్మికులు పరుగులు తీశారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ సత్యనారాయణ, సీఐ ఆర్.మల్లికార్జునరావు ప్రమాద స్థలానికి చేరుకొని పరిశీలించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ప్రమాద ఘటనపై ఆరా తీశారు. ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని పోలీసు అధికారులు వెల్లడించారు. పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈవ్‌టీజింగ్‌ను అరికట్టాలి

- సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షీయాజ్ ఖాన్ ఆదేశాలు



నర్సీపట్నం : కాలేజీలకు వెళ్లే అమ్మాయిలు ఈవ్‌టీజింగ్‌కు గురి కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలంటూ మండల లీగల్ సర్వీసు కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షీయాజ్ ఖాన్ డిప్యూటీ సూపరిండెంటెంట్ ఆఫ్ పోలీసు వారిని ఆదేశించారు. ఈవ్‌టీజింగ్‌ను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాలేజీ పరిసర ప్రాంతాల్లో పోలీసు నిఘా కట్టుదిట్టం చేయాలని, ఆకతాయిలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సీనియర్ సివిల్ జడ్జి పోలీసులను ఆదేశించారు. ప్రాహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్టుమెంట్ వారు జప్తు చేసి నర్సీపట్నం నుంచి చింతపల్లి పోవు రోడ్డుకు ఇరువైపులా పెట్టిన మోటారు వాహనాలను ఖాళీ చేయాలని సీనియర్ సివిల్ జడ్జి ఎక్సైజ్ సీఐకు లిఖితపూర్వకంగా ఆదేశాలు ఇచ్చారు.

సినీ ఫక్కీలో గంజాయి కారు ఛేజింగ్


- ఒకరు అరెస్ట్, ముగ్గురు పరార్



కారుతో పాటు నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

నర్సీపట్నం : సినీ ఫక్కీలో గంజాయి కారును ఛేజ్ చేసి పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. టౌన్ ఎస్‌ఐ రమేష్ అందించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడకు చెందిన నలుగురు యువకులు కారులో ఏజెన్సీలోని తాజంగి వెళ్లి గంజాయి కొనుగోలు చేసి తిరిగి ప్రయాణం అయ్యారు. డౌనూరు చెక్‌పోస్టు వద్ద ఆపకుండా ఢీకొట్టి పరారు అయ్యేందుకు ప్రయత్నించారు. చెక్‌పోస్టు తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు నర్సీపట్నం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రమేష్ సిబ్బందితో అప్రమత్తమయ్యారు. 15 కిలో మీటర్ల దూరం కారును వెంబడించారు. గంజాయి నిందితులు కారును వేగంగా నడుపుతూ వస్తూ జూనియర్ కళాశాల వద్ద ఉన్న మార్కెట్ సమీపంలో ఆటోను ఢీకొట్టారు. దీంతో ఆటో బోల్తాపడింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురిలో ముగ్గురు పరారవగా, కాకినాడకు చెందిన నాగబాబు అనే యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. కారును సీజ్ చేసి, కారులోని 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పరారైన వ్యక్తుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

అందాల పోటీల్లో నాతవరం యువతి ప్రతిభ



శిరీష

నాతవరం: తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో నిర్వహించిన అందాల పోటీల్లో నాతవరం గ్రామానికి చెందిన శిరీషాకు ప్రథమ స్థానం లభించింది. ఈనెల 1,2 తేదీల్లో వరంగల్‌లో సినీ జూనియర్ ఆర్టిస్టుల ఆధ్వర్యంలో యవతకు మోడలింగ్‌పై అవగాహన కల్పించడంతో పాటు, అందాల, నృత్యం పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో నాతవరానికి చెందిన యం.శిరీష పాల్గొని ప్రథమ స్థానం పొందింది. సినీ నటీమణులు పూజా నాగేశ్వర్, రీచాజోషి చేతుల మీ దుగా శిరీష శనివారం అవార్డు అందుకున్నారు. గతంలో హైదరాబాదులో నిర్వహించిన పలు అందాల, నృత్య పోటీల్లో శిరీష పాల్గొని అవార్డులు పొందారు.

డోలీ మోత.. మారని రాత

కొండ కోనల్లో అభివృద్ధికి, మౌలిక వసతులకు దూరంగా ఉన్న కుగ్రామమది.. చీడికాడ మండలంలో కోనాం వెళ్లే రోడ్డులో గుంటి గ్రామం వద్ద కొండ గెడ్డ దాటి అక్కడ నుంచి 3 కిలోమీటర్లు దిగువన 3 కిలోమీటర్లు కొండలపై నడక దారిన వెళితే రెల్లలపాలెం గిరిజన గ్రామం వస్తుంది. ఆ పల్లెకు వెళ్లడానికి అంత అవస్థ పడాలి కాబట్టే ఇంత కాలం పాలకులెవరూ పట్టించుకోలేదు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉండగా.. మళ్లీ ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అనేక సమస్యలు తీర్చారు. అదే స్ఫూర్తితో రహదారి వంటి మరిన్ని సదుపాయాలు కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మోసుకెళుతున్న గిరిజనులు (ఇన్‌సెట్) కొండపైన నడకదారిలో గ్రామానికి వెళుతున్న అడవి బిడ్డలు

- కొండ కోనల్లో దుర్భర జీవితం
- నిర్లక్ష్యం నీడలో రెల్లలపాలెం
- అధికారులు అడుగుపెట్టని గిరి గ్రామం
- తండ్రీ తనయుల పాలనలో అనేక కష్టాల నుంచి విముక్తి
- రహదారి నిర్మించి బతుకు దారి మార్చమంటున్న గిరిజనులు



అభివృద్ధికి నోచుకోని రెల్లలపాలెం గ్రామం



గుంటి నుంచి రెల్లలపాలెం వెళ్లే రహదారిలో గెడ్డపై ఇటీవల నిర్మించిన కల్వర్టు

చీడికాడ: రెల్లలపాలెం.. ఎత్తైన కొండపై విసిరేసినట్టుగా ఉంటుంది. ఈ గ్రామంలో నివసించే గిరిజనులు ప్రగతికి దూరంగా.. బతుకు భారంగా కాలం వెళ్లదీస్తున్నారు. ఎత్తులో ఉండడం, రహదారి సౌకర్యం లేకపోవడంతో ప్రభుత్వ సిబ్బంది ఎవరూ ఆ గ్రామం ముఖం చూడరు. సచివాలయ వ్యవస్థ వచ్చిన తరువాత పింఛన్లు అందించేందుకు ప్రతి నెల 1వ తేదీన మట్టా మల్లిక అనే వలంటీరు సగం దూరం వెళ్లి నెట్‌వర్క్ అందే ప్రాంతానికి గిరిజనులను రప్పించి పింఛన్లు అందించేవారు. ప్రస్తుతం సచివాలయ సిబ్బంది ఈ మూడు మాసాలు అదే ధోరణి అవలంబిస్తున్నారు. గిరిజనులకు అధికారులతో ఏ చిన్న అవసరం ఉన్నా కొండ దిగి కోనాం గాని చీడికాడ రావల్సిందే. రెల్లలపాలెం గ్రామంలో 16 కుటుంబాలకు చెందిన 54 మంది నివసిస్తున్నారు.

తండ్రీ తనయుల పుణ్యమా అని..

వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యేంతవరకు కరెంటు సౌకర్యం లేక ఆ గ్రామం అంధకారంలోనే గడిపింది. ఆయన హయాంలో విద్యుత్ లైన్ వేయడంతో ఆ కుగ్రామం వెలుగులీనింది. అప్పట్లోనే రూ.14 లక్షలతో మెటల్ రోడ్డు మంజూరైంది కానీ ఇంతలో వైఎస్సార్ దుర్మరణం పాలయ్యారు. ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ముఖ్యమంత్రులు కానీ, టీడీపీ ప్రభుత్వం కానీ పట్టించుకోకపోవడంతో అభివృద్ధి ఆగిపోయింది. గ్రామంలో ఎంపీపీ పాఠశాల ఉండేది. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో 2015లో రేషనలైజేషన్ పేరిట పాఠశాలను రద్దు చేశారు.

దీంతో కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను వసతి గృహాల్లో చేర్పించారు. కొంతమంది తమతో పనులకు తీసుకెళుతున్నారు. వీరికి జాబ్‌కార్డులున్నా ఉపాధి సిబ్బంది కొండెక్కి గ్రామంలో చేపట్టే పనులు గుర్తించకపోవడంతో వీరికి ఉపాధి పనులు కేటాయించడం లేదు. గడిచిన 10 ఏళ్ల నుంచి ఉపాధి కల్పన లేకుండా పోయింది. నీటి అవసరాలను తీర్చే తాగునీటి రాతికట్ట బావి ఎండిపోవడంతో గ్రామానికి 100 మీటర్ల దూరంలో దిగువన గల సెలయేటి నీటినే అటు తాగునీటికి, ఇతర అవసరాలకు వినియోగిస్తున్నట్లు గ్రామస్తులు ఎనికల దేముడమ్మ, ఈరటా ఈశ్వరమ్మ, కొమటి గా. బన్న, కోట మల్లమ్మ చెప్పారు. ఈ సమస్యను గుర్తించిన మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు జలజీవన్ మిషన్‌లో భాగంగా సుమారు రూ.20 లక్షలతో కొత్త బావిని తవ్వించి, పైపులైన్లు, కుళాయిలు ఏర్పాటు చేసి, వాటి ద్వారా ఇంటింటికీ నీరు అందిస్తున్నారు. **గర్భిణులు, బాలింతలు ప్రభుత్వం అందించే నెలవారీ పోషకాహార సరుకులు తీసుకోవాలంటే రెండు కొండలు దిగి మరో 3 కిలోమీటర్లు నడిచి గుంటి గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రానికి రావల్సిందే.** తమ గ్రామాన్ని సందర్శించి తమ కష్టాలు పరిశీలించమని గతంలో ఎన్నిసార్లు సచివాలయం సిబ్బందికి, మండలస్థాయి అధికారులకు అర్జీలిచ్చినా పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా గద్దెనెక్కిన తరువాత కొండ గెడ్డపై కల్వర్టు నిర్మాణం, తాగునీటి సమస్య పరిష్కారానికి నూతన బావి తవ్వి ఇంటింటికి కుళాయిల ద్వారా నీరు అందిస్తున్నారు. అంతే కాకుండా 20 కుటుంబాల వారికి తాతల కాలం నుంచి తమ సాగులో ఉన్న అటవి భూములకు అటవీ హక్కుల చట్టప్రకారం ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు అందించారు.

మా గ్రామానికి రండి మహాప్రభో..



ఇంతవరకు మా గ్రామం సందర్శించిన అధికారులే లేరు. మా సమస్యలు చెప్పుకోవడానికి కొండ దిగి వచ్చినా కార్యాలయాలకు వెళ్లి అధికారులను వెతుక్కొనే సరికే పగటి సమయం గడిచిపోతుంది. మా కష్టాలు చెప్పి తిరిగి గ్రామాలకు వెళ్లలేక మా పల్లెలోనే ఉండిపోతున్నాం. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, జగనన్న హయాంలో కొంతైనా మాకు మేలు జరిగింది. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని మాకు రహదారి కల్పించి సమస్యలు తీర్చాలి.

–కోట అశినాయుడు, గిరిజన రైతు, రెల్లలపాలెం

మా బతుకులింతేనా..



జ్వరమొచ్చినా, జబ్బొచ్చినా, రాత్రి వేళ గర్భిణులకు పురిటి నొప్పులొచ్చినా డోలీలు కట్టుకుని 10 కిలోమీటర్ల దూరంలో గల కోనాం ఆస్పత్రికి తీసుకెళతాం. రోడ్డొస్తే మా సమస్యలు సగం తీరినట్టే.. కానీ ఎవరూ పట్టించుకోరు. ఉన్న ఊళ్లో పనిలేక ఎక్కడకు వెళ్లలేక అర్ధాకలితో బతుకీడుస్తున్నాం. మా బతుకులింతే. అగ్గిపెట్టె కొనాలన్నా కిందకొచ్చి పట్టుకెళ్లాల్సిందే తప్ప ఎవరూ రారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మా రహదారి సమస్య తీర్చాలి.

–ఈరటా నర్సింహమూర్తి, ఏపీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి, రెల్లలపాలెం

సీఎం పర్యటనతో ప్రయాణికుల ఇక్కట్లు

- మూడు గంటల ముందే రాకపోకల నిలిపివేత
- ట్రాఫిక్ నిబంధనలు పాటించని పోలీసులు



పరవాడ జాజివానిపాలెం జంక్షన్ వద్ద పోలీస్ జీపును రోడ్డుకు అడ్డంగా పెట్టి ట్రాఫిక్ నిలిపివేసిన పోలీసులు

సాక్షి, అనకాపల్లి : సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో పరవాడ మీదుగా ప్రయాణించే వాహనచోదకులు, ప్రయాణికులు పలు ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం మధ్యాహ్నం 12.05 గంటలకు రావాల్సి ఉండగా...ఉదయం 9 గంటల నుంచే రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సులను పరవాడ వైపు వెళ్లకుండా దారి మరలించడంతో ప్రయాణికులు, ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు పలు ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం 10.30 గంటల నుంచి ఆటోలు, ద్విచక్రవాహనాలను కూడా నిలిపివేశారు. దీంతో దాదాపుగా మూడు గంటల పాటు వాహన చోదకులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. అతి సాధారణంగా ప్రజలతో మమేకమవుతానని, నా సమావేశాలకు ప్రజలకు ఇబ్బందులకు కలిగించనని ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశాల్లో చెబుతారు..కానీ సీఎం పర్యటన నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని పలువురు ప్రయాణికులు విమర్శించారు. సమావేశానికి రెండు గంటల ముందు నుంచే వాహనదారులను పోలీసులు నిలిపివేశారు.

నిబంధనలు పాటించని పోలీసులు

ట్రాఫిక్ నియమాలు నిబంధనలకు విరుద్ధంగా వాహనదారులను పోలీసులు ఇబ్బందులకు గురిచేశారు. కూర్మన్నపాలెంలో గల వైజాగ్ స్టీల్ ప్రధానద్వారం వద్ద ఎటువంటి పోలీసు బలగాలు లేకపోవడంతో నేరుగా ప్రయాణికులు ఈ రోడ్డు మార్గాన పరవాడకు వెళుతున్నారు. పరవాడ మండలం జాజివానిపాలెం జంక్షన్ నుంచి రోడ్డుకు అడ్డంగా పోలీసుల జీప్ ఉంచి వాహనదారులను నిలిపివేయడంతో అత్యవసర ప్రయాణాలు చేసేవారు చాలా ఇబ్బందులకు గురయ్యారు. పోలీసులు ముందస్తు సమాచారం కూడా ఇవ్వలేదు. దీంతో ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు.

సుదీర్ఘంగా... సుత్తి.!

- ఐదేళ్ల క్రితం మాటల్నే వల్లెవేసిన చంద్రబాబు
- రాత్రి 10 గంటల వరకు సమీక్ష పేరుతో శిక్ష
- విజన్.. విజన్ అంటూ విసుగు తెప్పించారు
- ప్రతి విషయానికీ అధికారులపై చిర్రుబుర్రులు



సాక్షి, విశాఖపట్నం/మహరాణిపేట : 2014–19లో చెప్పిన మాటలే.. సుదీర్ఘంగా సమీక్ష పేరుతో మరోసారి వల్లెవేశారు. విజన్ విజన్ అంటూ రాత్రి 10 గంటల వరకూ సీఎం చంద్రబాబు చేసిన సమీక్ష అధికారులకు శిక్షలా మారింది. ప్రతి విషయానికీ అధికారుల వివరణ ఇస్తున్నా పట్టించుకోకుండా చిర్రుబుర్రులాడుతూ అభివృద్ధిపై ఏదో దీర్ఘకాలిక ప్రణాళిక ఉందన్నట్లుగా హడావుడి చేసేశారు. శనివారం మధ్యాహ్నం 3 గంటల తర్వాత విశాఖ వచ్చిన చంద్రబాబు.. సాయంత్రం 5.40 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అప్పటి నుంచి విశాఖ మెట్రో ప్రాజెక్టు, మాస్టర్ ప్రణాళిక, నీతి ఆయోగ్ గ్రోత్‌హబ్, రోడ్ల అనుసంధానం, తదితర అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. 1995లో సీఎం అయినప్పటి నుంచి చెబుతున్నట్లుగానే ఈసారి కూడా విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తాను.. విశాఖ అంటే నాకు అపారమైన ఇష్టమంటూ చర్విత చరణంగా మాట్లాడటంపై అధికారులు విసుక్కున్నారు. హుద్‌హుద్ సమయంలో చేసిన విషయాలను సమీక్షలో ఎందుకు చెబుతున్నారో తెలియక అధికారులు తలలు పట్టుకున్నారు. నగరంలో పార్కులు ఏర్పాటు చేయాలని ఆదేశించగా.. ఇప్పటికే గత ఐదేళ్లలో అభివృద్ధి చేసిన పార్కుల వివరాలను అధికారులు వివరిస్తే.. దానిపై అసహనం వ్యక్తం చేస్తూ కొత్తగా పార్కులను ఆధునికీకరించాలంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అదేవిధంగా గుంతలు లేని రోడ్లు వీలైనంత త్వరగా చూడాలని చెప్పగా.. ఇప్పటివరకు నిర్మించిన రహదారులు, మరమ్మతుల వివరాలు చెప్పేందుకు ప్రయత్నించిన అధికారులపైనా ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. మెట్రో ప్రాజెక్టుకు డీపీఆర్ సిద్ధమై.. కేంద్రానికి పంపించినా కొత్తగా మళ్లీ డీపీఆర్ సిద్ధం చేయాలని చంద్రబాబు ఆదేశించారు. ఇలా.. ప్రతి అంశంపైనా చర్చిస్తున్న సమయంలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనుల్ని వివరించేందుకు అధికారులు ప్రయత్నించారు. వాటని పట్టించుకోకుండా తమ ప్రభుత్వ హయాంలో చేపట్టాల్సిన పనులపైనే దృష్టిసారించాలంటూ చంద్రబాబు హుకుం జారీ చేశారు. హైదరాబాద్ మాదిరిగా విశాఖని అభివృద్ధి చేస్తానని.. 2047 విజన్ డాక్యుమెంట్ ప్రకారం 15 శాతం వృద్ధి సాధించే దిశగా సాగాలని ఆదేశించారు. 2025 లేదా 2026 నాటికి భోగాపురం ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వచ్చే నాటికి అన్ని అభివృద్ధి ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు పాల్గొన్నారు.

మంత్రులపై ఎమ్మెల్యేల అసహనం..!

వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో శనివారం ఉదయం మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి సమీక్ష నిర్వహించారు. వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష జరిగింది. దీనికి తమను ఆహ్వానించకపోవడంపై ఎమ్మెల్యేలు అసహనం వ్యక్తం చేశారు. ఎందుకు ఆహ్వానించలేదో చెప్పాలని మంత్రిని ప్రశ్నించారు. దీనిపై ఇన్‌చార్జి మంత్రి సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. ఈ విషయాన్ని రుషికొండ వద్ద సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీ శ్రీభరత్, మంత్రులు కలిసి తమని దూరం పెడుతున్నారంటూ ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన బాబు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని మంత్రి నారాయణని హెచ్చరించినట్లు తెలుస్తోంది. రాత్రి 10.30 గంటల తరువాత టీడీపీ కార్యాలయానికి చేరుకొని కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు.

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



సభలో ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖ లీగల్: మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవన విధానం వెరసి మహిళల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నట్లు విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలో విశాఖ జిల్లా న్యాయవాదుల సంఘం, విశాఖ మహిళా న్యాయవాదుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ క్యాన్సర్ పరిశోధన వైద్య సేవా కేంద్రం నిర్వహించిన మహిళా క్యాన్సర్ ప్రాథమిక పరీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ నేడు మహిళలు పురుషులతో పాటు సమానంగా పనిచేయటం, కుటుంబ నిర్వహణ సమర్థవంతంగా చేస్తున్నారన్నారు. మహిళలు ఆరోగ్యానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్యాన్సర్ పరిశోధన చికిత్స కేంద్రం ప్రధాన వైద్యులు డాక్టర్ డాక్టర్ వి.ప్రవీణ మాట్లాడుతూ కారణాలు కూడా లేకుండా అత్యంత ప్రమాదకరంగా క్యాన్సర్ వ్యాధి సోకుతున్నట్లు చెప్పారు. ముఖ్యంగా మహిళలు బెస్ట్ క్యాన్సర్ విషయంలో అప్రమత్తత అవసరమన్నారు. మహిళా న్యాయవాదుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు అనురాధ మాట్లాడుతూ పలు కారణాల వల్ల మహిళలు వ్యాధులను కోరి తెచ్చుకుంటున్నట్లు చెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే నిండు ప్రాణానికే ముప్పు గలిగే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మెట్రోపాలిటీ సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ, కేంద్ర నేర అన్వేషణ ప్రత్యేక న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జి.గాయత్రి, న్యాయవాదుల సంఘం కార్యదర్శి డి.నరేష్, సీనియర్ న్యాయవాదులు లక్ష్మీ రాంబాబు, హేమమాలిని, న్యాయవాదులు పాల్గొన్నారు. డాక్టర్ సుభద్ర దేవి తదితరులు వైద్య సేవలు అందించారు.

బిల్డప్ బాబు గారూ..

ఆపండి ప్రగల్భాలు.. ఇవిగోండి వాస్తవాలు

సాక్షి, అనకాపల్లి: ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు కావస్తున్నా.. హామీలు నెరవేర్చడంపై దృష్టి పెట్టని సీఎం చంద్రబాబు.. అనకాపల్లి జిల్లా పర్యటనలో గొప్పలు చెప్పుకోవడంతో జనం నవ్వుకుంటున్నారు. పరవాడ మండలం వెన్నెలపాలెంలో రోడ్ల మరమ్మతు పనులు ప్రారంభించిన ముఖ్యమంత్రి ఆ సందర్భంగా మాట్లాడుతూ.. అనేక ప్రగల్భాలు పలికారు. ఆయన మాటలు, వాస్తవాలను ఒకసారి బేరీజు వేస్తే..

- కల్లు గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో 10 శాతం కేటాయించామని సీఎం చెప్పారు. అనకాపల్లి జిల్లాలో ఒక్క మద్యం దుకాణం కూడా కల్లుగీత కార్మికులకు దక్కలేదు. మొత్తం 136 మద్యం దుకాణాలకు లక్కీ డిప్ తీయగా.. అందులో ఒక్కటి కూడా కల్లుగీత కార్మికులకు లభించలేదు. వారి కోసం మరో నోటిఫికేషన్ వస్తుందని ఎక్సైజ్ అధికారులు చెబుతుండగా ముఖ్యమంత్రి 10 శాతం దుకాణాలు కేటాయించామని చెప్పడం విడ్డూరం.
- బెల్ట్ షాపులు పెడితే బెల్ట్ తీస్తామన్నారు సీఎం చంద్రబాబు.. కొద్ది రోజుల్లోనే జిల్లాలోని ప్రతీ గ్రామంలో ఒక బెల్ట్‌షాపు ఏర్పాటు చేశారు. వేలంలో పాట పాడి మరీ మూడు నాలుగు లక్షలు చెల్లించి వ్యాపారులు బెల్టు దుకాణాలు దక్కించుకున్నారు. మద్యం బాటిల్‌పై రూ.20 ఎక్కువగా అమ్ముకునేందుకు జిల్లా ఎక్సైజ్ అధికారులు, స్థానిక కూటమి ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చారు.
- బ్లాక్‌లో ఇసుక వ్యాపారం చేసేవారిపై పీడీ యాక్ట్ పెడతామని చెప్పారు చంద్రబాబు.. స్వయాన స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇలాకాలోని నర్సీపట్నం గబ్బాడ ఇసుక డిపోలో అర్ధరాత్రి కూటమి నేతలు బ్లాక్‌లో ఇసుక రవాణా చేస్తున్నప్పుడు స్థానిక ప్రజలు అడ్డుకొని పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. వారిపై కేసులే లేవు.. ఫిర్యాదు చేసిన వారిపైనే కేసులు బనాయించిన కూటమి ప్రభుత్వం ఇది.
- నిరుద్యోగ భృతి ఇస్తున్నామని సీఎం నిస్సిగ్గుగా చెప్పారు. భృతి ఎప్పుడిచ్చారు బాబూ అని నిరుద్యోగులు నిలదీస్తున్నారు. 2014–19 కాలంలో నిరుద్యోగ భృతి ఇవ్వలేదనే కదా టీడీపీని ఘోరంగా ఓడించాం.. మళ్లీ అదే హామీ ఇచ్చి గద్దెనెక్కారు.. ఐదు నెలలైనా ఆ ఊసే లేదు.. భృతి ఇస్తున్నామని ఎలా చెబుతారు అని ప్రశ్నిస్తున్నారు.
- ఆడబిడ్డలను విలాస వస్తువుగా చూస్తే ఖబడ్దార్ అంటున్న చంద్రబాబు చిన్నారులపై విచ్చలవిడిగా జరుగుతున్న లైంగిక దాడులకు ఏమని సమాధానం చెబుతారని జనం ప్రశ్నిస్తున్నారు. దిశ పోలీస్‌స్టేషన్లు, దిశ యాప్ వల్ల మహిళలకు ఎంతో మేలు జరిగిందని, వారి వైపు చూసేందుకే కామాంధులు భయపడేవారని.. కానీ ఇప్పుడు మహిళలకు ఆ ధైర్యం లేకుండా చేసిందెవరు అంటూ మహిళలు చంద్రబాబు వ్యాఖ్యలపై మండిపడుతున్నారు.

నేత్రపర్వం.. నృత్యోత్సవం



కళాభారతిలో కూచిపూడి నాట్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు

మద్దిలపాలెం: సంయుక్త మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ నాట్యకారిణుల నృత్య విన్యాసాలు అబ్బురపరిచాయి. మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో శనివారం శ్రీహరిపురానికి చెందిన సంయుక్త మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ 7వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. నాట్య గురువు అరుణా పరమేష్ ఆధ్వర్యంలో సుశిక్షితులైన 36 మంది చిన్నారులు కృతులకనుగుణమైన హావభావాలతో నాట్య కచేరీని ఆద్యంతం రక్తి కట్టించారు. సనాతన సంప్రదాయాలను ఒడిసిపట్టి అపురూపంగా ప్రదర్శించిన చిన్నారుల నైపుణ్యాలు రసజ్ఞులైన ప్రేక్షక హృదయాలను దోచుకున్నాయి. గణేశ శ్లోకంతో ఉత్సవ ప్రదర్శనలకు శ్రీకారం చుట్టగా.. 16 మంది సీనియర్ విద్యార్థినులు అద్భుతంగా ప్రదర్శించారు. డాక్టర్ వెంపటి చిన సత్యం నృత్యపరికల్పన చేసిన బ్రహ్మాంజలి(ఆదితాళం, రాగమాలిక)కి 20 మంది నర్తకీమణులు చక్కటి సమన్వయంతో చూడ ముచ్చటగా నృత్యప్రదర్శన సాగింది. అన్నమాచార్య సంకీర్తనలకు బాలల నాట్య ముద్రలు, అభినయ కౌశలం ప్రేక్షకుల హర్షధ్వానాలందుకున్నాయి. ది డ్యాన్స్ ఇండియా ఆంగ్ల మాసపత్రిక సంపాదకుడు బత్తిన రంగ విక్రమ్ కుమార్, వాడా వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కన్నం వి.రమణా రావు, నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపక కార్యదర్శి కె.వి.లక్ష్మి తొలుత జ్యోతి ప్రజ్వలనలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రదర్శన అనంతరం విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు బహూకరించారు. విద్యార్థినులు తమ తల్లులతో కలసి నాట్య గురువు అరుణా పరమేష్‌ను ఘనంగా సత్కరించారు.

ఆస్తులపై బాదుడు..!

డిసెంబర్‌లో మార్కెట్ విలువ పెంపునకు సన్నాహాలు?



- భూముల విలువ సవరణ చేపట్టాలని ప్రభుత్వం నుంచి మౌఖిక ఆదేశాలు
- గత రెండు నెలలుగా రిజిస్ట్రేషన్ అధికారుల కసరత్తు
- ప్రాంతాలను బట్టి 20 నుంచి 60 శాతం పెంచాలని ఆలోచన
- భూముల విలువ, రిజిస్ట్రేషన్స్ చార్జీలు పెంచి సంపద సృష్టిపై ప్రభుత్వం దృష్టి
- మరో రెండు వారాల్లో ప్రభుత్వం నుంచి విధి విధానాలు వచ్చే అవకాశం

విశాఖ సిటీ: ఎన్నికలకు ముందు రాష్ట్ర సంపద సృష్టిస్తామని గప్పాలు కొట్టిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక ప్రజల నడ్డి విరిచి ప్రభుత్వ ఖజానా నింపడానికి సిద్ధమవుతున్నారు. ఒక సంక్షేమ పథకాన్ని ఎరగా వేసి.. మూడు వైపులా ముక్కు పిండి రెట్టింపు స్థాయిలో రాబట్టుకొనే ప్లాన్ వేస్తున్నారు. కేవలం తెల్లరేషన్ కార్డుదారులకు మూడు ఉచిత సిలిండర్లు ఇచ్చి.. మద్యం, విద్యుత్, రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రజల జేబులు ఖాళీ చేసే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే మద్యం ధరలు మందుబాబులకు చుక్కలు చూపిస్తుండగా.. మరో నెల రోజుల్లో విద్యుత్ బిల్లులు షాక్ కొట్టనున్నాయి. డిసెంబర్ నుంచి భూముల విలువ కూడా అమాంతం పెరిగి మధ్యతరగతి సొంతింటి కల చెరిగిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. త్వరలో భూముల విలువ సవరణకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. సంపద సృష్టి కోసం రిజిస్ట్రేషన్ ధరలు భారీగా పెంచాలని భావిస్తోంది. భూముల విలువతో పాటు రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ, ఇతరత్రా చార్జీలను సైతం పెంచే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

60 శాతం వరకు పెంపు..!

ప్రభుత్వ ఆదేశాలతో రిజిస్ట్రేషన్ అధికారులు భూముల మార్కెట్ విలువ సవరణకు అంచనాల ముసాయిదాను సిద్ధం చేశారు. వాస్తవానికి భూముల మార్కెట్ విలువ సవరణ విషయంలో శాస్త్రీయబద్ధంగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది. కానీ ప్రభుత్వ ఆదేశాలతో విశాఖ రూరల్, భీమిలి, ఆనందపురం, పెందుర్తి, గాజువాక ప్రాంతాల్లో భారీగా భూములు విలువ పెంచడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. కనిష్టంగా 20 శాతం నుంచి గరిష్టంగా 60 శాతం వరకు విలువ పెంచే అవకాశాలు ఉన్నట్లు అధికారులు సైతం భావిస్తున్నారు. ఇప్పటి వరకు నివాసిత, వాణిజ్య భూముల విషయంలోనే ఎక్కువగా పెంచుతూ వచ్చారు. ఈసారి మాత్రం కూటమి ప్రభుత్వం వ్యవసాయ భూముల విలువను సైతం గణనీయంగా పెంచే ఆలోచన చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. వీటి విలువ కూడా గరిష్టంగా 40 శాతం వరకు పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం. కమర్షియల్, జాతీయ రహదారికి ఆనుకొని ఉంటే భూముల విలువ రెట్టింపు చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

గత రెండు నెలలుగా కసరత్తు

భూముల మార్కెట్ విలువ సవరణపై నివేదిక తయారు చేయాలని ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు రెండు నెలల క్రితమే మౌఖిక ఆదేశాలు ఇచ్చింది. సవరణ ప్రతిపాదనలతో సిద్ధంగా ఉండాలని చెప్పింది. దీంతో ఆ దిశగా జిల్లాలో రిజిస్ట్రేషన్ శాఖాధికారులు రహస్యంగా కసరత్తు ప్రారంభించారు. క్షేత్ర స్థాయిలో మార్కెట్ ధరలపై స్థానిక సంస్థల అధికారులతో కలిసి విలువ ప్రతిపాదనలను సిద్ధం చేశారు. అయితే ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో విధి విధానాలు, మార్గదర్శకాలు వచ్చిన వెంటనే ఆ ప్రతిపాదనలకు తుది మెరుగులు దిద్దనున్నారు. మరో రెండు వారాల్లో ఇందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చే అవకాశాలు ఉన్నట్లు రిజిస్ట్రేషన్ అధికారులు భావిస్తున్నారు.

గత ప్రభుత్వంలో రెండు సార్లే..

టీడీపీ ప్రభుత్వం ఆదాయం పెంపు కోసం గతంలో మాదిరిగానే రిజిస్ట్రేషన్ ధరలు భారీగా పెంచేందుకు సిద్ధమవుతోంది. 2014–19 మధ్య నాలుగు సార్లు భూముల విలువ సవరణ చేసింది. 2019 నుంచి 2024 మధ్య వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కేవలం రెండు సార్లు మాత్రమే ధరలు పెంచారు. కోవిడ్ కష్టకాలంలో రాష్ట్ర ఖజానాకు రూపాయి ఆదాయం రాని సమయంలో కూడా రిజిస్ట్రేషన్ ధరలు పెంచలేదు. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం ఆదాయం కోసం మళ్లీ ప్రజలపై భారం మోపాలని నిర్ణయించింది.

చెదిరిపోనున్న సొంతింటి కల



విశాఖలో ఇప్పటికే భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నగర శివారు ప్రాంతాల్లో సైతం గజానికి రూ.25 వేలకు పైగా వెచ్చించాల్సి వస్తోంది. దీంతో వంద గజాల స్థలానికే రూ.25 లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉంటోంది. తాజాగా రిజిస్ట్రేషన్ విలువతో పాటు స్టాంప్ డ్యూటీ, ఇతరత్రా చార్జీలు పెరిగితే అదనంగా 5 నుంచి 8 శాతం ధర పెరిగే అవకాశముంది. ఇది మధ్య తరగతిపై తీవ్ర భారం పడనుంది. అలాగే భూముల ధరల పెంపు ప్రక్రియ రియల్ ఎస్టేట్‌కు దెబ్బపడేలా కనిపిస్తోంది. దీంతో ప్రభుత్వ నిర్ణయం ఇటు మధ్యతరగతిపైనే కాకుండా స్థిరాస్తి రంగంపై కూడా తీవ్ర ప్రభావం చూపించే అవకాశముంది.

విశాఖ నుంచి రూ.700 కోట్లు లక్ష్యం



రాష్ట్ర ఖజానాకు విశాఖ అత్యంత కీలకంగా మారింది. అన్ని శాఖలతో పాటు రిజిస్ట్రేషన్ శాఖ నుంచి కూడా జిల్లా నుంచే అత్యధిక ఆదాయం సమకూరుతోంది. ఏటా భూముల రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.500 కోట్లు నుంచి రూ.600 కోట్లు వరకు ఆదాయం వస్తోంది. 2023–24లో రూ.731.69 కోట్ల లక్ష్యానికి గాను రూ.504.82 కోట్లు ఆదాయం సమకూరింది. తరువాత ఎన్నికల ఏడాది కావడంతో ఆ ప్రభావం రిజిస్ట్రేషన్లపై పడింది. దీంతో ఈ ఏడాది రూ.600 కోట్లు దాటలేదు. అయితే భారీగా భూముల విలువ పెంచడం ద్వారా వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.700 కోట్లకు పైగా ఆదాయం సమకూరే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది.

టీడీపీ కార్యకర్తలా వ్యవహరిస్తున్న సీఐ



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

- రేవతమ్మ తీరుకు నిరసనగా 6న ధర్నా
- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: ఇసుక దోపిడీని అడ్డుకున్న వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టడాన్ని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఖండించారు. పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన నియోజకవర్గస్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూరల్ సీఐ రేవతమ్మ టీడీపీ కార్యకర్తలా వ్యవహరిస్తున్నారని, ఆమె తీరును నిరసిస్తూ ఈ నెల 6న సర్కిల్ పోలీసు స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు చెప్పారు. అధిక సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఇసుక దొంగలను స్వయంగా పట్టించినప్పటికీ సీఐ తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. ఇసుక దొంగలను వదిలేసి, ఇసుక దోపిడీని వెలుగులోకి తీసుకొచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులైన మున్సిపల్ వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, లీగల్ సెల్ విభాగం నాయకుడు మాకిరెడ్డి బుల్లిదొర్‌పై సీఐ అక్రమ కేసులు పెట్టారన్నారు.

మండల, గ్రామా కమిటీల ఏర్పాటుకు చర్యలు

పార్టీని మరింత పటిష్టం చేసేందుకు మండల, గ్రామ, అనుబంధ విభాగాల కమిటీలను వేయాలని పార్టీ అధిష్టానం ఆదేశించినట్టు ఉమాశంకర్ గణేష్ తెలిపారు. ఈమేరకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. మండల నాయకులు అంతా చర్చించుకుని మండలపార్టీ అధ్యక్షులను ఎంపిక చేయాలని సూచించారు. షెడ్యూల్ విడుదలైనందున నీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, రుత్తల యర్రాపాత్రుడు మాట్లాడుతూ సీఐ తీరును ఎండగట్టాల్సిన అవసరం ఉందన్నారు. సర్కిల్ కార్యాలయాన్ని స్పీకర్ సీహెచ్.అయ్యన్నపాత్రుడు తన ఇంటి కార్యాలయంగా చేసుకున్నారని ఆరోపించారు. స్పీకర్ ప్రోద్బలంతో వైఎస్సార్‌సీపీ నాయకులపై సీఐ అక్రమ కేసులు పెడుతున్నారని, కేసులకు భయపడే ప్రసక్తి లేదన్నారు. ప్రజా సమస్యలపై పోరాడాల్సిన బాధ్యత ప్రతిపక్ష నాయకులపై ఉందన్నారు. సీఐ వైఖరిని నిరసిస్తూ నిర్వహించనున్న ధర్నాకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, ఎంపీపీలు సాగిన లక్ష్మణమూర్తి గజ్జలపు మణికుమారి, వైఎస్సార్‌సీపీ నాలుగు మండలాల అధ్యక్షులు సుర్ల సత్యనారాయణ, లగుడు నాగేశ్వరరావు, రుత్తల శ్రీనువాసరావు, మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, జెడ్పీటీసీ సుర్లగిరిబాబు, జిల్లా నాయకురాలు లోచల సుజాత, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ పథకానికి కూటమి ప్రభుత్వం తూట్లు

- సీపీఐ జోనల్ కార్యదర్శి వై.ఎన్.భద్రం



సమావేశంలో మాట్లాడుతున్న వై.ఎన్.భద్రం

అనకాపల్లి: బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఖరీదైన వైద్యం అందిస్తున్న ఆరోగ్యశ్రీ పథకానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని సీపీఐ జోనల్ కార్యదర్శి వై.ఎన్.భద్రం అన్నారు. స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ పాలనలో పేద రోగులకు అవసరమైన ఆపరేషన్లకు వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కింద రూ.25లక్షల వరకూ మంజూరు చేయగా, నేటి కూటమి ప్రభుత్వం రూ.5లక్షలకు కుదించడం దుర్మార్గమన్నారు. ఈ పథకానికి మంగళం పాడేందుకు కుయుక్తులు పన్నుతోందని ఆరోపించారు. అప్పులు పుట్టకపోతే బలహీన వర్గాల రోగులు మృతిచెందవలసిందేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ పథకం కింద గత ప్రభుత్వ పాలనలో 3,255 వ్యాధులకు చికిత్స అందించగా, ఇప్పుడు వాటిని 1,990 వ్యాధులకు మాత్రమే కుదించాలని చూడడం అన్యాయమన్నారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని రద్దుచేసి, ఆయుష్మాన్ భారత్ పేరుతో కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకంలో విలీనం చేయాలని యోచిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఆపరేషన్లు చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న రోగుల ఖాతాలో అసర ఖర్చుల కిందవేసే మొత్తాన్ని ఆగస్టునెల నుంచి నిలుపుదల చేశారన్నారు. కొత్త పథకాలు అమలు మాట దేవుడెరుగు ఉన్న పథకాలను కూటమి ప్రభుత్వం తీసివేయడం పేదల రోగులపాలిట శాపంగా మారిందని తెలిపారు. ప్రజారోగ్యాన్ని ప్రైవేటు, ఆరోగ్య బీమా సంస్థలకు ధారాదత్తం చేయాలని చంద్రబాబు యోచిస్తున్నట్లు తెలుస్తోందన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవల కింద రూ.25లక్షల వరకూ వైద్య ఖర్చులకు మంజూరు చేయాలని ఆయన కోరారు.

జిల్లాలో స్పోర్ట్స్ విలేజ్ ఏర్పాటుకు చర్యలు

- ఏపీ క్రీడా ప్రాధికారిక సంస్థ రాష్ట్ర చైర్మన్ రవినాయుడు
- రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలు ప్రారంభం
- మూడు రోజుల పాటు నిర్వహణ



వివిధ జిల్లాల ఖో-ఖో క్రీడాకారులు

అనకాపల్లి:

జిల్లాలో త్వరలో స్పోర్ట్స్ విలేజ్‌ను ఏర్పాటు చేసి, క్రీడా హబ్‌గా తీర్చిదిద్దనున్నట్టు ఏపీ క్రీడా ప్రాధికారిక సంస్థ రాష్ట్ర చైర్మన్ ఎ.రవినాయుడు తెలిపారు. మండలంలోని తుమ్మపాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ -17 రాష్ట్రస్థాయి బాలబాలికల ఖో-ఖో పోటీలను శనివారం రాత్రి ఆయన ప్రారంభించి మాట్లాడారు.

ప్రతి నియోజకవర్గంలో స్టేడియంల నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. క్రీడలతో మానసిక,శారీరక ఆరోగ్యంతో పాటు ఉపాధి, ఉద్యోగావకాశాల లభిస్తాయన్నారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్టు ఆయన చెప్పారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన క్రీడాకారులకు సోమవారం రాత్రి బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు. ఉత్తమ క్రీడాప్రతిభ కనబర్చిన వారిని జాతీయ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్లకు ఎంపిక చేయనున్నట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపవిద్యాశాఖ అధికారి అప్పారావు, తుమ్మపాల గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు, ఖో ఖో రాష్ట్ర పర్యవేక్షకులు రాధాకృష్ణ, జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి మోటూరి నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు



జ్యోతిని వెలిగిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు వేచలం విద్యార్థులు



విద్యార్థులు, పీడీ తమ్మునాయుడును అభినందిస్తున్న హెచ్‌ఎం నర్సింహమూర్తి

దేవరాపల్లి: వేచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. ఆంధ్రాయూనివర్సిటీ గ్రౌండ్‌లో గత నెల 30న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలోజరిగిన ఉమ్మడివిశాఖ జిల్లా స్థాయి పోటీల్లో వేచలం హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి బి.చైతన్య అండర్-17 బాలికల విభాగంలో ట్రిపుల్ జంప్, లాంగ్ జంప్‌లోను, పదవ తరగతి విద్యార్థి జి. సుధ 400 మీటర్ల హార్డిల్స్‌లో సత్తా చాటారు. అండర్-17 బాలుర విభాగంలో టెన్త్ విద్యార్థి టి.రవిశంకర్ 5 కిలోమీటర్ల రేస్ వాక్‌లోను, వి.నారిబాబు హైజంప్, 400 మీటర్ల హార్డిల్స్‌లోను సత్తా చాటారు. వీరు శ్రీకాకుళం జిల్లాలో ఈ నెల 3,4 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని స్థానిక హైస్కూల్ హెచ్‌ఎందేవులపల్లి నర్సింహమూర్తి తెలిపారు. విద్యార్థులతో పాటు పీడీ ఆర్.తమ్మునాయుడును సర్పంచ్ నాగిరెడ్డి శరారినాయుడు, ఎంపీటీసీ రెడ్డి శ్రీలక్ష్మి, స్కూల్ కమిటీ చైర్మన్ నగేష్ అభినందించారు.

పేద కుటుంబంలో విషాదం

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
- పార్టీకి వెళుతూ..పరలోకాలకు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహాలక్ష్మి, గాయపడిన కిరణ్

అచ్యుతాపురం: పేద కుటుంబంలో విషాదం అలుముకుంది. స్నేహితుడు ఇచ్చిన పార్టీకి వెళ్లేందుకు ఎంతో ఆనందంగా బయలుదేరిన ఓ యువకుడిని అంతలోనే మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. బ్రాండిక్స్‌లో పనిచేస్తూ కుటుంబానికి అండగా ఉన్న కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. వివరాలు ఇలా ఉన్నాయి. పూడిమడక శివారులోని కడపాలెం గ్రామానికి చెందిన మేరుగ కోటయ్య చేపల వేటపై ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కోటయ్య, చినతల్లి దంపతులకు ముగ్గురు పిల్లలు. పెద్ద కుమార్తె, పెద్ద కుమారుడికి వివాహమైంది. వీరి చిన్న కుమారుడు మహంతి ఉరఫ్ మహాలక్ష్మి బ్రాండిక్స్‌లో పనిచేస్తూ తండ్రికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. శనివారం మధ్యాహ్నం మేరుగు మహాలక్ష్మి(21), కడపాలేనికి చెందిన స్నేహితుడు యజ్జల కిరణ్(20)తో కలిసి గ్రామం నుంచి అచ్యుతాపురం వెళుతుండగా అచ్యుతాపురం విద్యుత్ కార్యాలయం వద్ద ఎదురుగా వచ్చిన గేదెను తప్పించబోయిన సమయంలో వెనుకనుంచి వచ్చిన లారీ ఢీకొంది. దీంతో మహాలక్ష్మి లారీ చక్రాల కింద నలిగి మృతి చెందగా, కిరణ్ తీవ్రంగా గాయపడ్డాడు. బ్రాండిక్స్‌లో పని చేస్తున్న మహాలక్ష్మి షిఫ్ట్ విధులు ముగించుకుని ఇంటికి వెళ్లి, తన స్నేహితుడు ఇచ్చే పార్టీకి హాజరయ్యేందుకు బైక్‌పై వెళ్తుండగా ప్రమాదం జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మహాలక్ష్మి మృతితో కడపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



ప్రమాదానికి గురైన బైక్

చుట్టపుచూపుగా వచ్చి దుర్మరణం



శ్రీనివాసరాజు మృతదేహం

కశింకోట: మేనకోడలు ఇంటికి చుట్టపుచూపుగా వచ్చిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సీఐ అల్లు స్వామినాయుడు అందించిన వివరాలు.. హైదరాబాద్‌లోని మియాపూర్‌కు చెందిన వేములమండ శ్రీనివాసరాజు (60) మండలంలోని జి.భీమవరంలో ఉన్న తన మేనకోడలు ఇంటికి చుట్టపుచూపుగా వచ్చాడు. తిరిగి హైదరాబాద్ వెళుతుండగా మండలంలోని నరసింగబిల్లి వద్ద శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టానికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

క్లుప్తంగా

ఫార్మసిస్టుల సేవలు గొప్పవి



ఉత్తమ సేవలందించిన ఫార్మసిస్టులకు సర్టిఫికెట్లు అందిస్తున్న భరత్‌కుమార్

అనకాపల్లి: వైద్య విభాగంలో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో కీలకమైనదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని కొత్తూరు పంచాయతీ బీఆర్టీ కాలనీలో రత్నాల ప్రకాశరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కరోనా వంటి విపత్తుల సమయంలో ఫార్మసిస్టులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల కోసం పనిచేశారని గుర్తుచేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఫార్మసిస్టుల సేవలు గొప్పవన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన ఫార్మసిస్టులకు సర్టిఫికెట్లను భరత్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో ఫార్మసిస్టుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

క్రీడా మైదానం శుభ్రతలో అధికారులు విఫలం



ఎన్టీఆర్ క్రీడా మైదానం వాకింగ్ ట్రాక్‌పై ప్లాస్టిక్ కవర్లు, చెత్తాచెదారం

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో దీపావళి దుకాణాలు ఏర్పాటు చేసిన తర్వాత చెత్తాచెదారం శుభ్రం చేయడంలో సంబంధిత అధికారులు విఫలమైనట్లు క్రీడా మైదానం వాకర్స్ అండ్ వాకర్స్ కోశాధికారి ఓం నమఃశివాయ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీపావళి వేడుకలు పూర్తయి మూడు రోజులవుతున్నా క్రీడా మైదానాన్ని శుభ్రం చేయకపోవడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్స్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వాకింగ్ ట్రాక్ చుట్టూ ప్లాస్టిక్ కవర్లు, గాజు పెంకులు, పాడైన ఐరెన్ చిన్నపాటి పరికరాలతో ఇబ్బందులు తప్పడం లేదని చెబుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని క్రీడా మైదానంలో చెత్తాచెదారం తొలగించాలని ఆయన కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 1443 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,940	4,900
రెండో రకం	3,390	4,200
మూడోరకం	3,000	3,360

అనకాపల్లి సినిమాలు

దేవర	:రాజా
'క'	:సత్యనారాయణస్క్రీన్-1
అమరాన్	:సత్యనారాయణస్క్రీన్-2
వేట్టయాన్	:షిర్డిసాయి
జనక అయితే గనక	:పర్తిసాయి
బఘీర	:వెంకటేశ్వర
విశ్వం	:శ్రీసత్య
లక్కీభాస్కర్	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 57 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్ 6 యూనిట్లు, బి పాజిటివ్-24 యూనిట్లు, ఓ పాజిటివ్-26 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్.9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 318 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 267 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

తుమ్మపాల.. అభివృద్ధి హేల

తుమ్మపాల మేజర్ పంచాయతీ అభివృద్ధి బాటన సాగిపోతోంది. వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.8 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. దీంతో ప్రజలకు మౌలిక సదుపాయాలు చేరువయ్యాయి. నువ్వులు, జనుములు, అపరాల పంటలు బాగా పండే ఈ ప్రాంతంలో రైతులు సాగులో ముందంజలో ఉన్నారు. చిరుధాన్యాల సాగు, పాడి పరిశ్రమ కూడా ఇక్కడ కళకళలాడుతున్నాయి. ప్రస్తుతం ఇక్కడ రూ.కోటి 30 లక్షల నిధులతో మరింత అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

- రూ.1.30 కోట్లతో పలు అభివృద్ధి పనులు
- సాగు, పాడి రైతులకు వెన్నుదన్నుగా పంచాయతీ



ప్రమీలానగర్ నుంచి ఎల్లయ్య కాలువకు వెళ్లే రహదారిలో జరుగుతున్న డ్రైనేజీ పనులు



తుమ్మపాలలో పాడి పశువులు



తుమ్మపాల గ్రామంలో వరి పొలాలు

అనకాపల్లి: మండలంలో తుమ్మపాల మేజర్ పంచాయతీ రూ.కోటి 30 లక్షల ఎంపీపీ నిధులతో అభివృద్ధి బాటలో ప్రయాణిస్తోంది. పంచాయతీ జనాభా సుమారు 25,267. రాష్ట్రంలో వి.వి.రమణ సుగర్ ఫ్యాక్టరీలో వందలాది మంది ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ కార్మికులు విధులు నిర్వర్తించేవారు. సుగర్ ఫ్యాక్టరీని టీడీపీ పాలనలో మూసివేయడంతో కార్మికులకు పూర్తిస్థాయిలో జీతాలు అందలేదు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ హయాంలో సుమారు రూ.5.60 కోట్లు పర్మినెంట్ కార్మికులకు జీతాలు చెల్లించారు. చెరకు, వరి పంట సాగులో ఈ ప్రాంతానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. మండలంలో ఎక్కువగా రైతులు, కౌలు రైతులు ఉండే గ్రామం ఇదే.

- గ్రామంలో ఒక సర్పంచ్‌తో పాటు, 18 మంది వార్డు మెంబర్లు, ఐదుగురు ఎంపీటీసీలు ఉన్నారు.
- శారదా నది ఒడ్డును ఆనుకుని ఉండడంతో సాగు ఎక్కువగా ఉంది. చెరకు, వరి, చిరుధాన్యాలు విరివిగా పండుతాయి.
- తుమ్మపాల పంచాయతీ పరిధిలోని మెట్ట భూమిలో రైతులు చిరుధాన్యాలు పండిస్తారు.
- రైతులు ఎక్కువగా ఉండడంతో పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతోంది. ప్రతి శనివారం తుమ్మపాల మెయిన్‌రోడ్డులో పశువుల సంత ద్వారా గేదెలు, ఆవులు, మేకలు, కోళ్లు, ఇతర జంతువుల అమ్మకాలు జరుగుతాయి. జిల్లాలో వివిధ మండలాల నుంచి రైతులు, ఇతర వర్గాల ప్రజలు సంతలో పశువులను అమ్మకాలు, కొనుగోళ్లు చేస్తుంటారు.
- నువ్వులు, జనుములు, అపరాల పంటలు బాగా పండుతాయి.
- నాలుగు విశాఖ డెయిరీ పాల కేంద్రాలతో పాటు, అమూల్, తిరుమల పాల డెయిరీ ద్వారా వేలాది లీటర్ల పాలు అమ్మకాలు సాగడమే కాకుండా అనకాపల్లి పట్టణంలో కొంత మంది ప్రజలు ఇక్కడి నుంచి స్వచ్ఛమైన పాలు కొనుగోలు చేసుకుని గృహాలకు తీసుకెళ్తారు.
- పంచాయతీ పరిధిలో శారదా నది ప్రవాహం ఉండడంతో ఆది, మంగళ, బుధ, శుక్రవారాలు వివిధ రకాలైన చేపల అమ్మకాలు జరుగుతాయి.
- పంచాయతీ పరిధిలో సుమారు 20 ఇటుకల పరిశ్రమలు ఉండడంతో స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన నిరుద్యోగులకు ఇటుకల కంపెనీల్లో ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయి.
- ఐదు అంగన్‌వాడీ కేంద్రాలు, ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మూడు విలేజీ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. ప్రజలు రోగాల బారిన పడకుండా నిత్యం వైద్య సిబ్బంది పర్యవేక్షణ చేస్తారు.
- వృద్ధులు, నిరుద్యోగులు ఖాళీ సమయంలో చదువుకునేందుకు గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు..

గత వైఎస్సార్‌సీపీ పాలనలో పంచాయతీ పరిధిలో రూ.8 కోట్లతో అభివృద్ధి పనులు జరగ్గా, ప్రస్తుతం మండల పరిషత్ నిధులు రూ.కోటి 30 లక్షలతో సీసీరోడ్లు, డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి. తుమ్మపాల శివాలయం వీధి నుంచి గవరపేట వీధి వరకూ రూ.20 లక్షల నిధులతో సీసీ రోడ్డు, ప్రమీలానగర్ నుంచి ఎల్లయ్యకాలువ వరకూ సీసీ డ్రైనేజీలకు రూ.26 లక్షలు, పంచాయతీ చివర విద్యుత్ నగర్, మధురానగర్ రహదారి, డ్రైనేజీకి రూ. 50 లక్షల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మిగిలిన నిధులతో కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి.

అభివృద్ధి పథాన తుమ్మపాల



గత ప్రభుత్వ హయాంలో పంచాయతీ పరిధిలో అభివృద్ధి చేశాం. ప్రస్తుతం ప్రధాన కాలువలు, చివరి గ్రామంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు చేపడుతున్నాం. ఎక్కడైనా సమస్యలు ఉన్నట్లయితే పంచాయతీ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలి.

– పంచదార్ల కన్నారావు, ఎంపీటీసీ సభ్యుడు, తుమ్మపాల

5న నాగదుర్గమ్మ జాతర ఉత్సవాలు



నాగదుర్గమ్మ జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో అమ్మవారి ఉత్సవాలు, పండగలు నిర్వహించుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక రింగ్ రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఎన్టీఆర్ మార్కెట్ యార్డులోని శ్రీనాగదుర్గమ్మ జాతర మహోత్సవ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 5న నిర్వహించే అమ్మవారి జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తారని, వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ముందుగా గవరపాలెం దిబ్బ వీధి నాగేంద్రస్వామి దేవస్థానం ఉత్సవాల కరపత్రాలను భరత్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, వైస్ ఎంపీపీ అయితా రాము, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పార్టీ కశింకోట మండల అధ్యక్షుడు మలసాల కిషోర్‌కుమార్, సీనియర్ నాయకులు మూనూరు శ్రీనివాసరావు, రమణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాండం తొలిచే పురుగు నుంచి రక్షణ తప్పనిసరి

అనకాపల్లి: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో కాండం తొలిచే పురుగు, ఆకు ముడత పురుగు పెరిగే అవకాశం ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్ ముకుందరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నివారణకు కార్టాప్ హైడ్రో క్లోరైడ్ మందును 2 గ్రాములు లేదా అసిఫేట్ 1.5 గ్రాము లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. తల్లి పురుగు కనిపిస్తే ట్రైకోగ్రామా గుడ్డు పరాన్నజీవిని ఎకరాకు 20 వేలు చొప్పున విడుదల చేస్తుందన్నారు. సుడిదోమ, పాడతెగులు ఆశించే అవకాశం ఉన్నందున మోనోక్రొటోఫాస్ 2.2 మిల్లీలీటర్లు హెక్సాకొనజోల్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. వరిలో కంకి నల్లి పురుగు ఆశించే అవకాశం ఉన్నందున స్పైరోమెసిఫెన్ 1 మిల్లీలీటరు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. చెరకులో పేనుబంక పురుగు, పసుపు ఆకు తెగులు వ్యాపిస్తే పేనుబంక పురుగు ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున నివారణకు డైమిథోయేట్ 2 మిల్లీలీటర్ల లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఎకరాకు ఒక కిలో మల్లి కెను పిచికారీ చేసి నివారించవచ్చన్నారు. వర్షాధార చెరకు ఎరువుల యాజమాన్యం ఎకరానికి 40 కిలోల మ్యురేట్ ఆఫ్ పొటాష్‌ను మొక్కల పక్కన చిన్న గుంతలు తీసి వేసుకోవాలన్నారు. రబీలో మొక్కజొన్న వేసే రైతులు అధిక దిగుబడినిచ్చే డీహెచ్ఎం-117, 111, 119 వంటి రకాలను ఎంపిక చేసుకుని ఎకరాకు 8 కిలోల చొప్పున కాప్టన్ లేదా మాంకోజెబ్ మందు 3 గ్రాములు కిలో విత్తనానికి విత్తన శుద్ధి చేసి వేసుకోవాలని తెలిపారు. కలుపు నివారణకు ఎకరా పొలంలో 55 కిలోల యూరియా, 220 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 60 కిలోల మ్యురేట్ ఆఫ్ పొటాష్‌ను ఆఖరి దుక్కిలో వేసుకోవాలన్నారు. ఖాళీగా ఉన్న పొలాల్లో విత్తనం కోసం పండించే జనుమును హెక్టారుకు 12-14 కిలోల చొప్పున వరుసల మధ్య 30 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 10 సెంటీమీటర్ల దూరంలో వేసిసాగు చేసుకోవచ్చని తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేయిస్తున్న రిత్‌దేవ్ మహారాజ్

అనకాపల్లి: ఆరోగ్యంగా జీవించాలంటే నిత్యం యోగా చేయాలని, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులకు యోగాసనాలు ఎంతగానో ఉపయోగపడతాయని పతంజలి యోగ శిక్షకులు దొరమ్మ నాయుడు అన్నారు. స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో ఐదు రోజుల యోగ శిక్షణ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు శనివారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో మధుమేహ వ్యాధితో సుమారు 30 వేల మంది బాధపడుతున్నారని, సుగర్ వ్యాధిని యోగ ద్వారా తరిమికొట్టవచ్చన్నారు. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలంటే కొన్ని ప్రత్యేక ఆసనాలను తప్పనిసరిగా వేస్తూ మంచి ఆహార నియమాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హరిద్వార యోగ పీఠం స్వామి రిత్‌దేవ్ మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌కు వెళ్లి పింఛన్ అందజేత



విశాఖ కేజీహెచ్‌లో నూకరాజుకు పింఛన్ అందజేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ హరిణి

కశింకోట: వైఎస్సార్‌సీపీ హయాంలో నెలకొల్పిన సచివాలయాల్లో నియమితులైన ఉద్యోగులు చక్కటి సేవలందించటమే కాకుండా తమ ఔదార్యాన్ని ప్రదర్శిస్తున్నారు. విశాఖపట్నం కేజీహెచ్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పింఛన్‌దారుడికి మండలంలోని సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ సొంత ఖర్చుతో అక్కడికి వెళ్లి శనివారం పింఛన్ సొమ్ము అందజేసి ఔదార్యాన్ని చాటారు. మండలంలోని తాళ్లపాలెం పంచాయతీ శివారు బంగారయ్యపేటకు చెందిన అమిరిశెట్టి నూకరాజు అనారోగ్యంతో ఇటీవల కేజీహెచ్‌లో చేరి చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో తాళ్లపాలెం 2వ సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ హరిణి తన సొంత ఖర్చుతో విశాఖ వెళ్లి ఈ నెల వచ్చిన రూ. 4 వేల పింఛన్ సొమ్మును అందజేశారు. దీంతో హరిణికి నూకరాజు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా కార్తీక మాసోత్సవాలు



కశింకోట ధ్యాన వేంకటేశ్వర స్వామి



తిమిరాంలో ఉమామహేశ్వరి స్వామిని దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి

కశింకోట: కార్తీక మాసోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కశింకోటలోని శారదానదిలో సంప్రదాయంగా ఎక్కువ మంది మహిళలు స్నానాలు ఆచరించారు. అనంతరం అక్కడి వేంకటేశ్వరస్వామి, ఉమా మహేశ్వరస్వామి ఆలయాలను దర్శించి పూజలు చేశారు. గవరపేట, డీపీఎన్ హైస్కూల్, వెలంపేట ప్రాంతాల్లో నెలకొల్పిన గౌరీపరమేశ్వరులను మహిళలు దర్శించుకుని పూజలు చేశారు. కశింకోట ధ్యాన వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామిని అందంగా పూల మాలలు, తులసీ మాలలతో అలంకరించి విష్ణు సహస్ర నామార్చన చేశారు. అక్కడి శివాలయం, లక్ష్మీనృసింహ స్వామి ఆలయం, కస్పావీధిలోని సాంబశివుని ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాలను భక్తులు సందర్శించి పూజలు చేశారు.

చోడవరం: పవిత్ర కార్తీక మాసం పూజలు శనివారం అన్ని శివాలయాల్లో భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. నెలరోజుల పాటు జరిగే ఈ పవిత్ర పూజల్లో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొంటున్నారు. ప్రాచీన దేవాలయమైన చోడవరం శ్రీ స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయం ఉదయం నుంచి భక్తులతో రద్దీగా మారింది. మూడు నదులు కలిసే చోట పుణ్యస్నానాలు ఆచరించి ముద్దుర్తి సంగమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. గోవాడ, గవరవరం, జుత్తాడ శివాలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. చోడవరం శ్రీ స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ఆకాశ దీపోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతి ఆధ్వర్యంలో వేదపండితులు మంత్రోచ్ఛరణ మధ్య స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆకాశదీపానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు పాల్గొన్నారు. దేవదాయ శాఖ ఈవో వి.వి.సత్యనారాయణమూర్తి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గూనూరు సురేష్, గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మల్లునాయుడు, మాజీ ఎంపీపీ గూనూరు సత్యనారాయణ, మండల అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్, మాజీ జెడ్పీటీసీ కనిశెట్టి మత్యరాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మజ్జి గౌరీశంకర్ పాల్గొన్నారు.

రోలుగుంట: కార్తీక మాసం సందర్భంగా భక్తులు శివాలయాలను దర్శించుకుని అభిషేకాలు చేశారు. శనివారం నాడు స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. సిద్ధి వినాయక ఆలయం వద్ద ఆడారి గణేష్ పాత్రో ఆకాశదీపం ఏర్పాటు చేశారు. మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి ఇక్కడకు వచ్చి పూజలు చేశారు. ఈ మాసంలో ప్రతి రోజూ ఈ దీపం ఆరకుండా వెలిగించడం జరుగుతుందని, రాత్రి వేళ శివనామ కీర్తనలతో భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశామని, సిద్ధి వినాయక, జీవకారుణ్య సంఘ సభ్యులు విధిగా పాల్గొని విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ కోరారు.

కె.కోటపాడు: కార్తీకమాసం ప్రారంభం కావడంతో శివాలయాల్లో ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు. ఎ.కోడూరులో గల భ్రమరాంబికా సహిత మల్లికార్జునస్వామి, కె.కోటపాడులో భీమలింగేశ్వరాలయం, లంకవానిపాలెంలో గృహలింగేశ్వరాలయం, ఆనందపురంలో రామలింగేశ్వరాలయం, చౌడువాడలో కాశీవిశ్వేశ్వరాలయంలలో కార్తీకమాస పూజలు భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు.

దేవరాపల్లి: తిమిరాం ఉమామహేశ్వరీ స్వామి ఆలయంలో స్థానిక పురోహితులు పాకల కామేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తజనం పాల్గొన్నారు. మాజీ ఉపముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు స్వామి వారిని దర్శించుకొని పూజలు జరిపారు. దేవరాపల్లి వనదేవీశ్వర, ఉమామహేశ్వరీ దేవి, బోయిలకింతాడ, పెదనందిపల్లి, చిననందిపల్లి, ఎం.అలమండ, వేచలం తదితర గ్రామాల్లో శివాలయాల్లో కార్తీక పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి..

విద్యార్థుల నడవడికపై దృష్టి అవసరం

నర్సీపట్నం: విద్యార్థుల నడవడికపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.శోభ సూచించారు. కళాశాలలో శనివారం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రవర్తన, విద్యాభ్యాసంపై తల్లిదండ్రులు నిత్యం దృష్టి పెట్టాలని, అప్పుడే చక్కటి ఫలితాలు వస్తాయన్నారు.

వరి పంటలో పొటాష్ లోపం గుర్తించాలి



మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు

అనకాపల్లి: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో వరి పంటలో పొటాష్ లోపం కనిపిస్తుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శనివారం శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ, ఉద్యానవనశాఖ అధికారులతో టి అండ్ వి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట సాగులో సిఫారసు చేసిన పొటాష్ ఎరువును ఎంవోపీ రూపంలో 35 కిలోలు రెండు సమ భాగాలుగా దమ్ములో సగం, నాటిన 60 రోజులకు మిగిలిన సగం ఉపయోగించవలసి ఉందన్నారు. అయితే రైతులు పొటాష్ ఖర్చుపెరిగిన కారణంగా దానిని తగ్గిస్తుండడంతో వరి పంటలో పొటాష్ లోపం కనిపిస్తుందన్నారు. రైతులందరు సమగ్ర ఎరువుల యాజమాన్యాన్ని పాటించి పైర్లలో పొటాష్, బాస్వరం, జింకు లోపాలను నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయశాఖ ప్రతినిధి శ్రీధర్ మాట్లాడుతూ జిల్లాలో విస్తృతంగా నిర్వహిస్తున్న కార్యక్రమల్లో శాస్త్రవేతలు పాల్గొని రైతులకు తగిన సలహాలు అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్తలు పీవీకే జగన్నాథరావు, కె.వి.రమణమూర్తి, పి.వి.పద్మావతి, ఎంబీజీఎస్ కుమారి, డి.ఉమామహేశ్వరరావు, జిల్లాలో వివిధ మండల వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యానవన శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలపై పనిభారం తగదు

నర్సీపట్నం : ఆశా కార్యకర్తలపై అదనపు పని భారం మోపడం సరికాదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు పేర్కొన్నారు. జిల్లా కమిటీ సభ్యులు ఎం.సత్యవతి అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశా కార్యకర్తలకు జాబ్ చార్టులో లేని పనులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం, సబ్‌సెంటర్లలో ఎంఎల్‌హెచ్‌పీల వద్ద డ్యూటీలు, సర్వేలకు రికార్డులు ఇవ్వకుండా ఆశా కార్యకర్తలకు పని భారం పెంచుతున్నారని అన్నారు. కనీస వేతనాలు, ఉద్యోగ విరమణ సౌకర్యాలు, పెన్షన్ సౌకర్యం లేదన్నారు. గొడ్డు చాకిరీ చేయిస్తున్నారన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, కె.వి.పి.ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, అరుణా, వరలక్ష్మి, రమణమ్మ, కుమారి, సునీత పాల్గొన్నారు.

15లోగా స్వచ్ఛంద పంటల బీమా చెల్లించాలి

మాడుగుల రూరల్ : జాతీయ పంటల బీమా పథకంలో భాగంగా రైతులు ఈ ఏడాది స్వచ్ఛంద పంటల బీమాను చెల్లించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి ఎం. వాసుదేవరావు తెలిపారు. బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులకు బీమా ప్రీమియం మొత్తాన్ని బ్యాంకులు మినహాయించుకుంటాయని, రుణాలు తీసుకున్న రైతులు అవసరమైన ధ్రువపత్రాలు తీసుకుని, దగ్గరలో వున్న కామన్ సర్వీసు సెంటర్ నిర్వాహకులను సంప్రదించాలన్నారు. జాతీయ పంటల బీమా పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకుని, పంటల బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. జీడిమామిడి పంటకు ఎకరాకు రూ.1535 చొప్పున ఈ నెల 15 తేదీలోపు చెల్లించాలన్నారు. అపరాలు అయిన మినప పంటకు ఎకరాకు రూ.171, పెసరకు రూ.157, నువ్వుపంటకు రూ.150 చొప్పున వచ్చే నెల 15 తేదీలోపు ప్రీమియం చెల్లించాలన్నారు. దీంతో పాటు వరి పంటకు ఎకరాకు రూ.435 చొప్పున వచ్చే నెల 31వ తేదీ లోపు ప్రీమియం చెల్లించాలన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు అందిస్తున్న ఆర్థిక సహాయం పొందాలంటే 2019 ఫిబ్రవరి 1వ తేదీ నాటికి రైతులు తమ భూమి వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చి ఉండాలని, బ్యాంకు ఖాతాకు, వెబ్‌లాండ్‌లో తమ భూమి వివరాలకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని, అంతే కాకుండా సమీపంలో గల మీ సేవా కేంద్రం వారిని సంప్రదించి, ఈకేవైసీ కూడా చేసుకోవాలని తెలిపారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



తురకలపూడిలో మంచినీటి బోరు పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ రాంబాబు

బుచ్చెయ్యపేట : రానున్న వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి రాకుండా చూస్తానని జెడ్పీటీసీ దొండా రాంబాబు తెలిపారు. శనివారం తురకలపూడిలో గంట్ల వారి కళ్లాల వద్ద మంచినీటి బోరు పనులను ఆయన ప్రారంభించారు. ఎర్రవాయి ప్రాంతంగా గుర్తుంపు పొందిన బుచ్చెయ్యపేట మండలంలో ప్రతి ఏటా వేసవి కాలంలో భూగర్భ జలాలు ఇంకిపోయి తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లా పరిషత్ నుంచి మంజూరైన నిధులే కాక రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి ఇతర నాయకులు ద్వారా నిధులు తీసికొచ్చి బుచ్చెయ్యపేట మండలంలో అన్ని గ్రామాల్లో తాగునీటి బోర్లు ఏర్పాటుకు కృషి చేస్తున్నానని జెడ్పీటీసీ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు యర్రంశెట్టి గోవింద, ముచ్చకర్ల శ్రీను, గౌలజాన శ్రీను, గోపిశెట్టి శ్రీను, పెదిరెడ్ల మాణిక్యం, ఇందలి కోటేశ్వరరావు, గోకివాడ వరక్రిష్ణ, మాజీ సర్పంచ్ గంట్ల అప్పలనాయుడు, కోరుకొండ అప్పలనాయుడు, బాబూరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉల్లింగ రాజారావు, మంత్రి నాయుడు పాల్గొన్నారు.

మండల స్థాయి సుపథ ప్రతిభా పరీక్షలు నేడు

దేవరాపల్లి: దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సుపథ ప్రతిభా పరీక్షలను ఆదివారం నిర్వహించనున్నట్లు సుపథ ప్రతినిధులు తెలిపారు. విద్యార్థుల సృజనాత్మకతను పెంపొందింపజేసే ఈ పరీక్షలు సుపథ రూపకర్త, జగద్గురు పీఠం ప్రతినిధి యు.వి.ఎ.ఎన్. రాజు పర్యవేక్షణలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి జరుగుతాయని తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత స్థాయిలలో విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పద్య పఠనం, శ్లోక పఠనం, సుపథ గేయాలు, కృష్ణాష్టకం, నాకు నచ్చిన దేశ నాయకుడు, మంచి విద్యార్థి అనే అంశాలపై వ్యాస రచన పోటీలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత ప్రముఖుల చేతుల మీదుగా విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తామని సుపథ నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలకు 30 పాఠశాలల నుంచి 500 మందికి పైగా విద్యార్థులు హాజరవుతారని తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

అనకాపల్లి: రామాపురం కాలనీకి చెందిన గోపాల్ ఇంట్లో మద్యం క్వార్టర్ బాటిళ్ల అమ్మకాలు సాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అతన్ని 10 మద్యం క్వార్టర్ బాటిళ్లతో పట్టుకున్నట్లు పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.